క్లుప్తంగా

శ్రావణ సందడి ప్రారంభం

ఖమ్మంగాంధీచౌక్: పూజలు, వ్రతాలు, పండుగలు, ఉపవాసాలకు ప్రత్యేక మాసంగా పేరున్న శ్రావణ మాసం సందడి సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. దీంతో భక్తులతో దేవాలయాలు సందడిగా మారాయి. నగరంలోని ట్రంక్‌రోడ్‌లో ఉన్న శ్రీ గుంటు మల్లేశ్వరస్వామి దేవాలయం, స్తంభాద్రి గుట్టపై ఉన్న శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవాలయం, కాల్వొడ్డులోని శ్రీ సత్యనారాయణ సహిత వీరాంజనేయ స్వామి దేవాలయం, కమాన్‌బజార్‌లోని శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయం తదితర ఆలయాలను భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు.

నియామకం

తిరుమలాయపాలెం: తిరుమలాయపాలెం మండల ఎస్సైగా కూచిపూడి జగదీష్ నియమితులయ్యారు. ఈ మేరకు వరంగల్ డీఐజీ కార్యాలయం నుంచి సోమవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. తిరుమలాయపాలెంలో పనిచేసిన ఎస్సై గిరిధర్‌రెడ్డి మహబూబాబాద్ జిల్లా పెద్దగూడురుకి బదిలీ కాగా మహబూబాబాద్ జిల్లా తొర్రూరు ఎస్సైగా పనిచేస్తున్న జగదీష్‌ను ఇక్కడకు బదిలీపై వచ్చారు.

చెక్కుల పంపిణీ

ఖమ్మంరూరల్: మండలంలోని ఎంవెంకటాయపాలెంలో ఎమ్మెల్సీ అలుబెల్లి నర్సిరెడ్డి సిఫారసుతో మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను రైతు సంఘం సీపీఎం మండల కార్యదర్శి నంద్ర ప్రసాద్ సోమవారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో పెండింగ్‌లో ఉన్న నిధులను తక్షణమే విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు తేనె శ్రీను, చావా నాగేశ్వరరావు, ఎడ్లపల్లి వెంకటరామయ్య, డి.వెంకటేశ్వర్లు, జె.నాగేశ్వరరావు, యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

దేవాలయానికి విరాళం..

ఖమ్మంఅర్బన్: నగరంలోని నాలుగో డివిజన్ కైకొండాయిగూడెం క్రాస్‌రోడ్డులో ఉన్న శ్రీవిశాలాక్షిసమేత కాశీ విశ్వేశ్వరస్వామి దేవాలయానికి సోమవారం పలువురు దాతలు విరాళాలు అందజేశారు. పాత్తూరి రమేష్ గీత రూ.10,011లు, రామ్‌గోష్ రూ.22వేల నగదును అందజేశారు. ఈ నగదును అన్నదాన కార్యక్రమానికి వినియోగించనున్నారు.

విరాళాల సేకరణ

ఖమ్మంమయూరిసెంటర్: ప్రకృతి విపత్తు కారణంగా నష్టపోయిన కేరళలోని వాయినాడ్ ప్రాంతానికి చేయూతగా నిలిచేందుకు సీపీఐ శ్రేణులు సోమవారం ఖమ్మంలోని రోటరీనగర్, శ్రీనగర్ కాలనీ సహా పలు ప్రాంతాల్లో నిధులు సేకరించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ మాట్లాడుతూ.. విపత్తుకి నిరాశ్రయులైనవారు, అంగవైకల్యం కలిగినవారికి చేయూతనివ్వాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు శింగు నర్సింహారావు, సీహెచ్. సీతామహాలక్ష్మి, రావి శివరామకృష్ణ, మేకల శ్రీనివాసరావు, పగడాల మల్లేష్, నాయకులు ఏనుగు గాంధీ, ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శులు నానబాల రామకృష్ణ, ఇటికాల రామకృష్ణ, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు గాదె లక్ష్మీనారాయణ, శివ, నాయక్, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే నివాళి

కామేపల్లి: మండలంలోని పొన్నేకల్ గ్రామంలో పుల్లూరు బుగ్గవాగు ఆయకట్టు చైర్మన్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గింజల వెంకటనారాయణరెడ్డి దశదిన కార్యక్రమం నిర్వహించగా..ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య హాజరయ్యారు. సోమవారం ఈమేరకు మృతుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీకి, గ్రామాభివృద్ధికి ఆయన సేవలను ఎమ్మెల్యే కొనియడారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రాంరెడ్డి గోపాల్‌రెడ్డి, మండలాధ్యక్షుడు గింజల నర్సింహారెడ్డి, దమ్మాలపాటి సత్యనారాయణ, పుచ్చకాయల వీరభద్రం, దనియాకుల హన్మంతరావు, గుజ్జర్లపూడి రాంబాబు, నల్ల మోతు లక్ష్మయ్య, మాలోత్ సరిరాంనాయక్, అనురాధ, తదితరులు నివాళులర్పించారు.

జీపీల అభివృద్ధికి కృషి

నేలకొండపల్లి: పంచాయతీల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శాఖమూరి రమేష్ అన్నారు. మండలంలోని ముజ్జుగుడెం గ్రామంలో సోమవారం సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశాక మాట్లాడారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చొరవతో గ్రామాలన్నీ అభివృద్ధి చెందుతున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వి.లక్ష్మీనరసయ్య, యు.శ్రీనివాసరావు, యాకోబు, తదితరులు పాల్గొన్నారు.

జయప్రదం చేయండి

ఖమ్మం మామిళ్లగూడెం: నగరంలో సర్వాయి పాపన్నగౌడ్ 374వ జయంతి సందర్భంగా తెలంగాణ యాదవ మహాసభ ఆధ్వర్యాన కుల జనగణన బీసీల రిజర్వేషన్‌పై నిర్వహించే సదస్సును జయప్రదం చేయాలని మాజీ డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం కోరారు. సోమవారం ఖమ్మం మధురానగర్ గోకులకృష్ణ సేవాసమితిలో జిల్లా అధ్యక్షుడు భారీ మల్సూర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం దీనికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘ రాష్ట్ర నాయకులు లింగనబోయిన లక్ష్మణ్, పి.రాంబాబు, అశోక్‌కుమార్, అర్చన, రామకృష్ణ, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలు కనిపించడం లేదా?!

- డ్రెయిన్లు, రోడ్లు ఆక్రమిస్తే వెంటనే తొలగించాలి
- టీ తాగి.. జీడిపప్పు తిని వెళ్లడమే పనికాదు
- టీయూఎఫ్ఐడీసీ నుంచి రూ.100 కోట్లు
- కేఎంసీ కౌన్సిల్ సమావేశంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పక్కన మేయర్ నీరజ, కమిషనర్ అభిషేక్ అగస్త్య

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలో రోడ్లు, డ్రెయిన్లను ఆక్రమించి నిర్మాణాలు చేపడుతుంటే అధికారులకు కనిపించడం లేదా అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్పొరేటర్లు సైతం ఎందుకు డ్రెయిన్లపై ర్యాంపులు కట్టనిస్తున్నారని ప్రశ్నించారు. ఎంతటి వారైనా ఆక్రమణకు పాల్పడితే కార్పొరేటర్ల సహకారంతో తొలగించాలని అధికారులను ఆదేశించారు. మేయర్ పునుకొల్లు నీరజ అధ్యక్షతన ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశం సోమవారం జరగగా.. మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్దిష్ట సమయంలో ఆక్రమణలు తొలగించాలన్నారు. పారిశుద్ధ్య నిర్వహణపై ప్రజల్లో అసంతృప్తి ఉండగా.. నాలుగు నెలల నుంచి తాను చెబుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. 10 నుంచి 15 రోజుల్లో ఖాళీ స్థలాలను శుభ్రం చేయించాలని ఆదేశించారు. అలాగే, కుక్కల సంఖ్య పెరగకుండా ఏబీసీలో శస్త్ర చికిత్సలు పక్కాగా నిర్వహించాలన్నారు. సమావేశానికి టీ తాగి.. జీడిపప్పులు తిని వెళ్లడమే కాక పనులను బాధ్యతగా చేయాలని సూచించారు. డంపింగ్ యార్డ్ సమస్యకు త్వరలోనే పరిష్కారం చూపుతామని పేర్కొన్నారు. టీయూఎఫ్ఐడీసీ నుంచి రూ.100 కోట్ల నిధులు మంజూరైనందున ఏయే పనులకు అవసరమో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు.

స్థలాన్ని పరిశీలించకుండా ఎలా మారుస్తారు..?

కౌన్సిల్‌లో టౌన్ ప్లానింగ్ విభాగానికి సంబంధించి ఖాళీ స్థలాన్ని గృహావసరాల నుంచి వాణిజ్య అవసరాలకు మార్చే అంశం అజెండాలో ఉంది. అయితే, స్థలాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించలేదని తెలుసుకున్న మంత్రి మండిపడ్డారు. అధికారుల తీరుతో స్థల వివాదాలు ఏర్పడుతున్నాయని చెప్పారు. కమిషనర్‌తో చర్చించి స్థలాన్ని పరిశీలించాకే అనుమతులు ఇవ్వాలని ఆదేశించారు. అలాగే, ఐదు నెలలుగా కేఎంసీలో పారిశుద్ధ్యం బాగా లేదని ఫిర్యాదులు వస్తున్నా.. అదే కాంట్రాక్టర్‌కు మళ్లీ పనులు ఎలా అప్పగిస్తారని ప్రశ్నించారు. 31వ డివిజన్ నుంచి 60 డివిజన్ల వరకు చెత్త సేకరణపై స్పందిస్తూ కొత్త కాంట్రాక్టర్‌కు అప్పగించేలా పరిశీలించాలని తెలిపారు.

సమయపాలన లేదా..?

కేఎంసీ కౌన్సిల్ సమావేశం సోమవారం ఉదయం 11 గంటలకు ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. ఎక్స్ అఫీషియో సభ్యుడైన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు 10.55కు కేఎంసీకి వచ్చేసరికి మేయర్ చాంబర్‌లోనే ఉండడంతో ఆమె సహా అధికారులు, కార్పొరేటర్లను కౌన్సిల్ హాల్‌లోకి తీసుకెళ్లారు. సమావేశం ప్రారంభించే సమయానికి 15 మంది కార్పొరేటర్లు, కొందరు అధికారులే ఉండడంతో హాజరు నమోదు చేయాలని తెలిపారు. అయితే, అరవై మందిలో 45 మంది కార్పొరేటర్లు సమావేశానికి హాజరు కాగా.. 15మంది గైర్హాజరయ్యారు. ఈసందర్భంగా కార్పొరేటర్లు కమర్తపు మురళి, ఆళ్ల నిరీశరెడ్డి, తోట గోవిందమ్మ, బి.ప్రశాంతలక్ష్మి, కర్నాటి కృష్ణ, క్లైమెంట్, పగడాల శ్రీవిద్య, శ్వేత ప్రశ్నలు సంధించారు. అనంతరం కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులకు ఆరోగ్యబీమాపై త్వరలో నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.

ఏ రోజు వ్యర్థాలు అదేరోజు తరలింపు..

ఖమ్మం డంపింగ్ యార్డ్‌కు రోజు సుమారు 180 మెట్రిక్ టన్నులకు పైగా వ్యర్థాలు చేరుతుండడంతో చెత్త కుప్పలుగా పేరుకుపోతోంది. ఈ అంశం కౌన్సిల్‌లో చర్చకు వచ్చిన నేపథ్యాన కమిషనర్ అభిషేక్ అగస్త్య దృష్టి సారించారు. రోజువారీగా డంపింగ్ యార్డ్‌కు వచ్చే వ్యర్థాలను వచ్చిన అదేరోజు సెగ్రిగేషన్ చేసిన కుప్ప పేరుకుపోకుండా చేసే ముంబైకి చెందిన కంపెనీ ప్రతినిధులతో ఆరా తీశారు. సంస్థ ప్రతినిధులు, అధికారులతో సమావేశం కాగా... ఏ రోజుకారోజు చెత్త అదేరోజు వేరు చేయడంతో పాటు బయటకు తరలించవచ్చని ప్రతినిధులు సూచించారు. రోజుకు 180 మెట్రిక్ టన్నుల నుంచి 200 మెట్రిక్ టన్నుల వ్యర్థాలను వేరు చేసే యంత్రాల ఏర్పాటుకు అవకాశముందని.. తరలించేందుకు మెట్రిక్ టన్నుకు రూ.600 వరకు ఖర్చు అవుతుందని, కేఎంసీలో ఏటా రూ.5 కోట్ల నుంచి రూ.6 కోట్ల వరకు ఖర్చవుతుందని తెలిపారు. డంపింగ్ యార్డ్‌లో రెండు ఎకరాల స్థలం, విద్యుత్ సౌకర్యం కల్పిస్తే మిషనరీ ఏర్పాటు చేస్తామని చెప్పగా డీపీఆర్ సమర్పించాలని సూచించినట్లు తెలిసింది. అన్నీ అనుకూలిస్తే వచ్చే నెల నుండే ప్రాజెక్టును ప్రారంభించాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కమిషనర్‌ను ఆదేశించినట్లు సమాచారం.

రైతు బాగుంటేనే దేశానికి వెలుగు

ఖమ్మంవ్యవసాయం: రైతులు బాగుంటేనే దేశం బాగుంటుందని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఖమ్మంలో సోమవారం జరిగిన జిల్లా ఫెర్టిలైజర్, పెస్టిసైడ్స్, సీడ్స్ డీలర్ల సమావేశంలో మంత్రి మాట్లాడారు. రైతు బాగుంటేనే వ్యాపారులు, ఉద్యోగులు, పేద కుటుంబాలకు మేలు జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, నాయకులు నల్లమల వెంకటేశ్వరరావు, సాధు రమేష్‌రెడ్డి, ఫెర్టిలైజర్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పుల్లంఖండం నాగేందర్, చిట్టూరి ప్రభాకరచౌదరితో పాటు బోడేపూడి నాగేశ్వరరావు, రామడుగు మనోహర్‌రావు, లేళ్ల వెంకటరెడ్డి, పునుకొల్లు పృథ్వి తదితరులు పాల్గొన్నారు.

మహిళపై పోలీసుల తీరు ఆక్షేపణీయం



సమావేశంలో మాట్లాడుతున్న శిరోమణి

ఖమ్మంమయూరిసెంటర్: రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణంలో సునీత అనే మహిళపై పోలీసుల తీరు ఆక్షేపణీయమని, బాధిత మహిళకు న్యాయం చేయాలని పీవోడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్.శిరోమణి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఖమ్మంలోని రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో సంఘ జిల్లా అధ్యక్షురాలు జి.లలిత అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. బంగారం దొంగతనం చేసిందన్న నెపంతో విచారణ పేరుతో పోలీస్ స్టేషన్‌కు తరలించి ఆమెతో పాటు కుటుంబసభ్యులను విచక్షణారహితంగా కొట్టడం, గాయపరచడం దారుణమని, వెంటనే ఘటనపై న్యాయ విచారణ జరిపించి, పోలీసులను శిక్షించాలన్నారు. ప్రభుత్వం పోలీసులకు ఇచ్చిన విచక్షణ అధికారాలతో పేద ప్రజలు బలవుతున్నారని, ఈ ఘటనపై చర్యలు తీసుకోకపోతే ప్రత్యక్ష ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో రాష్ట్ర కోశాధికారి ఝాన్సీ, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎ.మంగతాయి, పి శోభ తదితరులు పాల్గొన్నారు.

అలుపెరుగని పోరాటయోధుడు 'బోడేపూడి'

ఖమ్మంమయూరిసెంటర్: అలుపెరుగని పోరాటయోధుడు, అమరజీవి బోడేపూడి వెంకటేశ్వరరావు అని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు పేర్కొన్నారు. సోమవారం స్థానిక సుందరయ్య భవనంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు వై.విక్రమ్ అధ్యక్షతన మధిర నియోజకవర్గ మాజీ శాసనసభ్యుడు బోడేపూడి 27వ వర్ధంతి సభ జరిగింది. తొలుత బోడేపూడి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నున్నా మాట్లాడుతూ.. ప్రజా ప్రతినిధిగా జీవితంలో అలుపెరుగని రాజకీయ పాత్ర పోషించిన బోడేపూడి ఆశయ సాధనకు అందరూ పాటుపడాలని కార్యకర్తలను కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ఎం.సుబ్బారావు, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు మాదినేని రమేష్, నందిపాటి మనోహర్, పి.ఝాన్సీ, ఆర్.ప్రకాష్, బషీర్, రమ్య, దొంగల తిరుపతిరావు, జిల్లా నాయకులు కత్తుల అమరావతి, రమాదేవి, మురహరి, నాగేశ్వరరావు, భిక్షం, వెంకన్న బాబు, రమేష్, బోడేపూడి విజ్ఞాన కేంద్రం బాధ్యులు వై.శ్రీనివాసరావు, ఎస్.వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

పాలకవర్గానికి ఘన వీడ్కోలు..

రఘునాథపాలెం: మండల పరిషత్ పాలకవర్గానికి ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం ఆయా మండల పరిషత్ కార్యాలయాల్లో సన్మాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ ప్రియాంక, ఎంపీపీ గౌరి, ఎంపీటీసీలు, బదిలీ అయిన అధికారులను ఘనంగా సన్మానించారు. అనంతరం పాలకవర్గం ప్రజలకు అందించిన సేవలను కొనియాడారు.కార్యక్రమంలో ఎంపీడీఓ అశోక్, ఎంపీఓ శ్రీనివాసరెడ్డి, కార్యదర్శులు పాల్గొన్నారు.

- **కామేపల్లి:** ప్రజాప్రతినిధిగా ఎన్నికై పేద ప్రజలకు సేవ చేసే అవకాశం దక్కడం అదృష్టమని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రాంరెడ్డి గోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీలకు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. పదవి ఉన్నా లేకున్నా పేద ప్రజలకు సేవ చేసినప్పుడే సమాజంలో గుర్తింపు ఉంటుందన్నారు. అనంతరం ప్రజాప్రతినిధులను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బానోత్ సునీత, జెడ్పీటీసీ బానోత్ వెంకటప్రవీణ్‌కుమార్‌నాయక్, ఎంపీడీఓ రవీందర్, తహసీల్దార్ సుధాకర్, వైస్‌ఎంపీపీ అజ్మీర విజయలక్ష్మి, ఎంపీటీసీ నల్లమోతు లక్ష్మయ్య, గుగులోత్ గబ్రూనాయక్, మల్లెంపాటి నర్సింహారావు, లకావత్ సునీత, ఏపూరి హేమమాలిని, మాలోత్ శంకర్, కీసర మంజుల, కొండాయిగూడెం పీఏసీఎస్ చైర్మన్ ధనియాకుల హన్మంతరావు, గుజ్జర్లపూడి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.
- **ఖమ్మంరూరల్:** ఐదేళ్ల పాటు ప్రజలకు సేవ చేసే అవకాశం దక్కడం అదృష్టమని, తనకు తోడ్పాటు అందించిన అధికారులు, ఎంపీటీసీలకు కృతజ్ఞతలు తెలపుతున్నట్లు ఎంపీపీ బెల్లం ఉమా పేర్కొన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన వీడ్కోలు సమావేశంలో ఎంపీపీ బెల్లం ఉమా దంపతులతో పాటు ఎంపీటీసీలను పూలమాలలు, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కుమార్, ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



రఘునాథపాలెం: పాలకవర్గం, అధికారులను సన్మానిస్తున్న దృశ్యం

- **తిరుమలాయపాలెం:** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ, ఎంపీటీసీలకు నిర్వహించిన సన్మాన కార్యక్రమానికి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈమేరకు ప్రజా సేవలో మమేకమై సేవలందించడం గొప్ప వరమని పేర్కొంటూ ఎంపీపీ మంగీలాల్, వైస్ ఎంపీపీ బుద్దా వంశీకృష్ణ, మండల కోఆప్షన్ సభ్యుడు సైపుద్దిన్‌తో పాటు ఎంపీటీసీలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సిలార్‌సాహెబ్, ఎంపీఓ సూర్యనారాయణ, జెడ్పీటీసీ బెల్లం శ్రీనివాస్, బీరోలు సొసైటీ చైర్మన్ రామసహాయం నరేష్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యా కాషాయీకరణకు వ్యతిరేకంగా పోరాటం

ఖమ్మంమయూరిసెంటర్: త్యాగాలు, పోరాటాలే ధ్యేయంగా ఏఐఎస్ఎఫ్ పని చేస్తుందని, దేశంలో విద్యా కాషాయీకరణకు వ్యతిరేకంగా పోరాడుతున్న సంఘమని ఆ సంఘ జాతీయ సమితి సభ్యుడు ఇటికాల రామకృష్ణ అన్నారు. సోమవారం ఖమ్మంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను వ్యతిరేకిస్తూ, శాస్త్రీయ విద్యా విధానం అమలు చేయాలని కోరుతూ మరో పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సంఘం ఏర్పాడి 88 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆగస్టు 12 నుంచి 31వ తేదీ వరకు వార్షికోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతీ గల్లీలో సంఘ జెండాను ఎగురవేసి వేడుకలను ప్రారంభించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘ జిల్లా సహాయ కార్యదర్శి శివనాయక్, నాయకులు ప్రతాప్, రాకేష్, గోపి, రాహుల్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఏంగెల్స్ జీవితం స్ఫూర్తిదాయకం

ఖమ్మంమయూరిసెంటర్: ప్రపంచ గతిని మార్చిన మార్క్సిజం రూపొందించిన కారల్ మార్క్స్ మిత్రుడు, శ్రామిక సిద్ధాంతాన్ని అందించిన ఏంగెల్స్ విశ్వమానవ కల్యాణం కోసం పరితపించారని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం ఏంగెల్స్ వర్ధంతి సందర్భంగా రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. గతంలో రూపొందించిన కమ్యూనిస్టు ప్రణాళికలో ఏంగెల్స్ ప్రతిపాదనలే ఎక్కువగా ఉంటాయని, నేటికీ ఆయన జీవితం స్ఫూర్తిదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆవుల వెంకటేశ్వర్లు, పుల్లయ్య, కె.అర్జున్‌రావు, ఆవుల అశోక్, శిరోమణి, ఝాన్సీ, మంగతాయి, శోభ, ప్రేమ్ సింగ్, సోములు, సీతారాములు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మం నగర గోల్డ్ కాంప్లెక్స్ పెయింటర్స్ యూనియన్ నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా శిగరాం బాబు, కారుమంచి శంకర్‌లు ఎన్నికయ్యారు. సంఘ వ్యవస్థాపకులు గొడ్డుగొర్ల వెంకన్న, నెల్లూరు శ్రీను, వేల్పుల శ్రీనివాస్, గౌరవ అధ్యక్షుడు షేక్.ఖాసీం ఆధ్వర్యాన నూతన కమిటీని ఎన్నుకున్నారు. సోమవారం ఖమ్మంలోని త్రీటౌన్ భక్తపోతన వీధి అర్వపల్లి పార్కు వద్ద గల సంఘ కార్యాలయంలో కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఉపాధ్యక్షుడిగా ప్రసాదరావు, కోశాధికారిగా బానోతు వీరన్న, సహాయ కార్యదర్శిగా మల్లికార్జున్‌తో పాటు సభ్యులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో నరసింహారావు, తిరుమలరావు, సైదులు, వీరస్వామి, షేక్.జానిమీయా తదితరులు పాల్గొన్నారు.

'ప్రజావాణి'లో వినతుల వెల్లువ



తిరుమలాయపాలెం: వినతులు స్వీకరిస్తున్న తహసీల్దార్ రామకృష్ణ

కామేపల్లి/ఖమ్మంరూరల్/తిరుమలాయపాలెం/ఖమ్మం అర్బన్/రఘునాథపాలెం: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆయా మండల తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో అధికారులు ప్రజల నుంచి వివిధ సమస్యలపై వచ్చిన దరఖాస్తులను స్వీకరించారు. ఈక్రమంలో కామేపల్లి మండల తహసీల్‌లో పింజరమడుగు, ఊట్కూర్ గ్రామానికి చెందిన ఇద్దరు తమకు పట్టాదారు పాస్ పుస్తకాలు మంజూరు చేయాలని దరఖాస్తు చేసుకోగా తహసీల్దార్ సుధాకర్ స్వీకరించారు. అలాగే ఖమ్మంరూరల్ మండల తహసీల్‌లో మొత్తం 23 దరఖాస్తులు రాగా అందులో రెవెన్యూ సమస్యలపై 16, గ్రామపంచాయతీల సమస్యలపై 6, వ్యవసాయశాఖకు సంబంధించి ఒక దరఖాస్తు వచ్చినట్లు తహసీల్దార్ కార్యాలయ సూపరింటెండెంట్ పి.సంపత్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు వి.నాగేశ్వరరావు, ఈ.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా తిరుమలాయపాలెం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి గ్రీవెన్స్‌లో మొత్తం 108 వినతులు రాగా వీటిలో 72 రెవెన్యూ సమస్యలపై, 25 పంచాయతీరాజ్‌లతో పాటు ఎలక్ట్రిసిటీ, అగ్రికల్చర్, ఇరిగేషన్, ఆరోగ్య, పోలీస్‌శాఖకు సంబంధించిన ఫిర్యాదులు అందాయి. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పీవీ రామకృష్ణ, ఎంపీడీఓ సిలార్‌సాహెబ్, అధికారులు పాల్గొన్నారు. అంతేకాక నగరంలోని ఖమ్మం అర్బన్ తహసీల్‌లో సీహెచ్.స్వామి, రఘునాథపాలెం తహసీల్‌లో తహసీల్దార్ విల్సన్ బెన్నీ ఫిర్యాదులు స్వీకరించారు. అలాగే అలాగే కూసుమంచి మండలంలో మొత్తం 17 దరఖాస్తులు రాగా అందులో రెవెన్యూ సమస్యలపై 12, గ్రామపంచాయతీల సమస్యలపై 1, వ్యవసాయశాఖకు సంబంధించి 3, విద్యాశాఖకు సంబంధించి 1 వచ్చినట్లు తహసీల్దార్ సురేష్‌కుమార్ తెలిపారు.

ఇక్కడ ఫిర్యాదులు తక్కువే..

మండల స్థాయి సమస్యలను ఎక్కడికక్కడే పరిష్కరించేందుకు సోమవారం నుంచి మండల కేంద్రాల్లో ప్రజావాణి కార్యక్రమాలను నిర్వహించారు. అయితే ఫిర్యాదుదారులకు ఈ కార్యక్రమంపై సరైన అవగాహన కల్పించకపోవడంతో ఖమ్మం, ఖమ్మంరూరల్ తహసీల్దార్ కార్యాలయాల్లో ఫిర్యాదులు అరకొరగా వచ్చాయి. అధికారులు ప్రజల కోసం వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్



ఖమ్మంరూరల్ తహసీల్దార్ కార్యాలయంలో ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

ఎమ్మార్పీఎస్ విజయోత్సవ సంబరాలు



కేక్ తినిపిస్తున్న నాయకులు

ఖమ్మంరూరల్: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును హర్షిస్తూ మండలంలోని మంగళగూడెం, వెంకటగిరిలో గత 30 ఏళ్ల పోరాటాన్ని గుర్తు చేసుకుంటూ సోమవారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యాన విజయోత్సవ సంబరాలు చేశారు. ఈ సందర్భంగా మిఠాయిలు పంచుకొని, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణమాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆంజనేయులు, బాబు, ఎం. శేఖర్, నాగరాజు, కె.వెంకటనారాయణ, సామేలు, రవి, రామయ్య తదితరులు పాల్గొన్నారు. ఈనేపథ్యాన మండలంలోని రామన్నపేటలో ముస్లిం పెద్దలు ఎమ్మార్పీఎస్ నాయకులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం పెద్దలు మదార్ సాహెబ్, బాబుసాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణకు వ్యతిరేకంగా ధర్నా..



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: ఎస్సీ వర్గీకరణ తీర్పును పునర్ పరిశీలించాలని ఖమ్మం జిల్లా మాల మహానాడు ఆధ్వర్యాన సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టింది. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు గుంతేటి వీరభద్రం, లింగాల రవికుమార్, ముదుసు జాకోబ్ ప్రతాప్, ఎల్లయ్య, దామలసత్యం, కనకయ్యలు మాట్లాడుతూ.. భారత రాజ్యాంగంలో పొందుపరిచిన ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు ఏ,బీ,సీ,డీలుగా వర్గీకరించే హక్కు ఒక్క పార్లమెంట్‌కు తప్ప సుప్రీంకోర్టుకు లేదన్నారు. ఎలాంటి కుల గణన, వర్గీకరణ జరగకుండా వర్గీకరణ చేస్తానని బాధ్యతరహితంగా మాట్లాడుతున్న ముఖ్యమంత్రి తనమాట వెంటనే వెనక్కు తీసుకోవాలని కోరారు. ఈ ధర్నాలో నాయకులు దయానంద్, సుధాకర్, కనకరాజు, గాదరి బాబు, శ్రీనివాస్, వీరబాబు, గంగాధర్, మల్లయ్య, రాధాకృష్ణ, వేణు, చిరంజీవి, రమేష్, నిర్మల, జ్యోతి, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

వాడవాడలా స్వచ్ఛదనం.. పచ్చదనం

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'స్వచ్ఛదనం–పచ్చదనం' కార్యక్రమాన్ని ప్రజాప్రతినిధులు, అధికారులు సోమవారం వాడవాడలా విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత, మొక్కల పెంపకంపై అవగాహన కల్పించేలా ర్యాలీలు, మానవహారం చేపట్టారు. విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. గ్రామాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

– సాక్షి నెట్‌వర్క్



ఖమ్మంమయూరిసెంటర్: 53వ డివిజన్‌లో అవగాహన కల్పిస్తున్న కార్పొరేటర్ పగడాల శ్రీవిద్యనాగరాజు



ఖమ్మంమయూరిసెంటర్: 51వ డివిజన్‌లో అవగాహన కల్పిస్తున్న కార్పొరేటర్ శీలంశెట్టి రమావీరభద్రం



తిరుమలాయపాలెంలో మానవహారం నిర్వహిస్తున్న విద్యార్థినులు, అధికారులు



నేలకొండపల్లి: బోదులబండలో పిచ్చి మొక్కలు తొలగిస్తున్న దృశ్యం



కామేపల్లి: ర్యాలీ తీస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు



ఖమ్మంఅర్బన్: 8వ డివిజన్ గోపాలపురంలో అవగాహన ర్యాలీ



ఖమ్మం సహకారనగర్: సూర్య స్కూల్ విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న 25వ డివిజన్ కార్పొరేటర్ గోళ్ల చంద్రకళ, వెంకటేశ్వర్లు



ఖమ్మంరూరల్: ఎంవెంకటాయపాలెంలో ర్యాలీలో పాల్గొన్న అధికారులు, సిబ్బంది